క్లుప్తంగా

నేటి నుంచి ఉరుసు



ప్రత్యేక అలంకరణలో సయ్యద్ గులాబ్‌షా సమాధి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీ చౌక్‌లో వెలసిన హజరత్ సయ్యద్ గులాబ్‌షా వలి రిఫాయి అహమ్మదీ రహమతుల్లాయి అల్లై ఉరుసు ఈనెల 30 తేదీన సోమవారం రాత్రి గంధంతో ప్రారంభం అవుతాయని దర్గా ముతవల్లీలు సయ్యద్ గులాబ్, సయ్యద్‌షా ఆదివారం తెలిపారు. వారు మాట్లాడుతూ 1న ఉరుసు అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్ననట్లు చెప్పారు. 2న జియారత్, రాత్రి ఖవ్వాలి కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎంపీఈఓల సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా ప్రసాద్



నంద్యాల(అర్బన్): అగ్రికల్చర్ మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ అసోసియేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా ఆదివారం తనను ఎన్నుకున్నారని జింకల ప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా కేంద్రం కర్నూలులో అసోసియేషన్ నాయకుల సమావేశం నిర్వహించారన్నారు. నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజు, పబ్లీ షెడ్ ఆర్గనైజర్ మల్లేష్, కార్యదర్శి మధుసూదన్‌గౌడ్, నంద్యాల జిల్లా గౌరవాధ్యక్షుడు నరసింహారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

3 నుంచి దసరా ఉత్సవాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలో వెలసిన పురాతనమైన గ్రామ దేవత శ్రీచాగలమ్మ ఆలయంలో అక్టోబరు నెల 3వ తేది నుండి ప్రారంభం కానున్న దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఉత్సవాలకు సంబంధించి ప్రత్యేక పూజలు, కార్యక్రమాల నిర్వహణపై ముద్రించిన పోస్టర్లను ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. అక్టోబరు 3 నుంచి 13వ తేదీ వరకు ఆలయంలో దసరా ఉత్సవాలను నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు వైసీ నరసింహ్మారెడ్డి, పీపీ సుబ్బారెడ్డి, నిర్సిరెడ్డి, జెట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



సుంకులమ్మను దర్శించుకుంటున్న భక్తులు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే దొర్నిపాడులో సుంకులమ్మ అమ్మవారికి భక్తులు బోనాలు సర్పంచి మొక్కులు చెల్లించుకున్నారు.

మహానందిలో యువకుల మధ్య ఘర్షణ

మహానంది: మహానందిలో ఆదివారం సాయంత్రం యువకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. మహానందికి చెందిన తేజ, బద్వేలుకు చెందిన సుమంత్, శివల మధ్య వివాదం చోటు చేసుకోవడంతో ఘర్షణకు దారితీసింది. ఆలయం వెనుక ఉండగా ఇరువర్గాల వారు వాదోపవాదాలకు దిగి గొడవ పడ్డారు. వెంటనే స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో ఏఎస్ఐ రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేస్తున్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించి వినతులు సమర్పించి పరిష్కరించుకోవాలని సూచించారు.

తగ్గిన నీటి విడుదల

జూపాడుబంగ్లా: ఎస్సార్బీసీ, తెలుగుగంగ కాల్వలకు అనుసంధానంగా ఉన్న రిజర్వాయర్లు నిండటంతో పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటి విడుదలను తగ్గించినట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హెడ్‌రెగ్యులేటర్ నుంచి 13 వేల క్యూసెక్కుల నీటిని ఎస్సార్‌ఎమ్సీలోకి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ నీటిని బానకచర్ల నీటి నియంత్రణ వ్యవస్థ నుంచి తెలుగుగంగ కాల్వకు 10వేలు, కేసీ ఎస్కేప్ కాల్వకు 3 వేల క్యూసెక్కుల చొప్పున వదులుతూ ఎస్సార్బీసీకి పూర్తిగా నిలిపివేసినట్లు వెల్లడించారు.

రీచార్జ్ చేస్తేనే వెలుగు

- జిల్లాలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు కసరత్తు
- ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు
- నివాస గృహాల్లోనూ అమర్చేందుకు యత్నాలు
- త్వరలో పాత విధానానికి చెక్

విద్యుత్ శాఖ స్మార్ట్‌గా మారుతోంది. సెల్‌ఫోన్ మాదిరిగానే రీచార్జ్ చేసుకుంటేనే విద్యుత్ సరఫరా అవుతుంది. లేదంటే కనెక్షన్ ఆటోమేటిక్‌గా కట్ అవుతుంది. జిల్లాలో ప్రస్తుతం స్మార్ట్ మీటర్ల ఏర్పాట్లుకు కసరత్తు వేగంగా జరుగుతోంది. ఇప్పటి వరకు వినియోగిస్తున్న పాత విద్యుత్ మీటర్ల స్థానంలో నూతనంగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనున్నారు. దీంతో పాత విధానం త్వరలోనే మరుగునపడనుంది.



నంద్యాల ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్

నంద్యాల(అర్బన్): ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ పరిధిలో ఇక స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసే దిశగా కసరత్తు జరుగుతోంది. ఈ ప్రక్రియలో నిరంతరం సరఫరా పొందాలంటే ముందే రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. వాస్తవానికి ఇప్పటి వరకు ఇళ్లలో వినియోగించే మీటర్లు ఎలా ఉంటాయో తెలిసిందే. ఎంత మేరకు వినియోగించామనే అంశం యూనిట్ల రూపంలో మీటర్‌లో తెలుస్తుంది. నెలకు వాడిన యూనిట్లను లెక్కగట్టి విద్యుత్ బిల్లులను సంబంధిత రీడర్లు జారీ చేస్తారు. దీనికి సంబంధించిన మొత్తాన్ని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు లేదా ఆన్‌లైన్ ద్వారా ఇప్పటి వరకు వినియోగదారులు చెల్లిస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే ఇది పోస్ట్ పెయిడ్ తరహాలో ఉంటుంది.

ముందే చెల్లించాలి...

రానున్న రోజుల్లో ఏర్పాటు చేయనున్న స్మార్ట్ మీటర్లు ప్రీ పెయిడ్ తరహాలో పనిచేస్తాయి. అంటే నిర్ణీత మొత్తానికి రీచార్జ్ చేసుకుంటేనే విద్యుత్ సరఫరా అవుతుంది. మరోవైపు విద్యుత్ వాడకంపై యాప్‌లో ఎప్పటికప్పుడు నోటిఫికేషన్లు వస్తుంటాయి. కొన్ని సందర్భాల్లో రాత్రి వేళ రీచార్జ్ మొత్తం పూర్తయినా, మరుసటి రోజు ఉదయం వరకు విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఢోకా ఉండదు. తదుపరి రీచార్జ్ చేసుకున్న తరువాత వాడుకున్న మొత్తాన్ని అందులో నుంచి మినహాయిస్తారు.

తొలిసారిగా ప్రభుత్వ కార్యాలయాల్లో...

జిల్లాలో తొలి సారిగా ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్‌లను ఇటీవల ఏర్పాటు చేశారు. అనంతరం పూర్తిస్థాయిలో అవగాహన వచ్చిన తర్వాత దశల వారీగా ప్రతి ఇంట్లోనూ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయనున్నారు.

విద్యుత్ వినియోగం తగ్గించేందుకే...

విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకే ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాయి. నంద్యాల జిల్లా 5,79,056 రెసిడెన్షియల్ కనెక్షన్లు ఉండగా 1,17,217 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. వీటి పరిధిలో ప్రతి రోజూ దాదాపు 7.72 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. ఇప్పటి వరకు నంద్యాల జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల్లో దాదాపు 1,500 స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసినట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. విద్యుత్ వినియోగాన్ని నియంత్రించేందుకు రాబోవు రోజుల్లో ఇళ్లలోను స్మార్ట్ మీటర్ల ఏర్పాటును చేయనున్నారు.

కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు..

డిస్కంలు నష్టాల ఊబిలో కూరుకుపోతుండటం.. మొండి బకాయిలు పేరుకుపోతుండటంతో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ క్రమంలో దశల వారీగా ఈ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చేందుకు విద్యుత్ సంస్థలు కసరత్తు ప్రారంభించాయి.

ఎలా పనిచేస్తుందంటే..

- ఇళ్లలో ప్రస్తుతం ఉండే మీటరుకు భిన్నంగా స్మార్ట్ మీటర్ పనితీరు ఉంటుంది.
- ముందుగానే రీచార్జ్ చేసుకోవాలి. సెల్‌ఫోన్‌లో బ్యాలెన్సు ఎలా చూసుకుంటామో.. ఇక్కడ అదే విధంగా యాప్‌లో చెక్ చేసుకోవచ్చు.
- బ్యాలెన్స్ ఉన్నంత వరకే విద్యుత్ సరఫరా ఉంటుంది. నగదు అయి పోయిన వెంటనే సరఫరా నిలిచిపోతుంది. దీంతో రీచార్జ్ చేస్తేనే విద్యుత్ వెలుగు.
- బ్యాలె న్స్ ఎంత ఉందో తెలియజేస్తూ నోటిఫికేషన్లు వస్తుంటాయి.

నష్టాలు ఇలా....

- విద్యుత్ సంస్థను నమ్ముకొని ఎన్నో ఏళ్లుగా మీటర్ రీడర్లు పనిచేస్తున్నారు. ఈ విధానం పూర్తిస్థాయిలో అమలైతే వారి ఉపాధికి పెద్ద దెబ్బేనని చెప్పొచ్చు.
- అవగాహన లేమితో రీచార్జ్ చేసుకోవడంలో వినియోగదారులు ఏ మాత్రం అలసత్వం వహించినా, సరఫరాకు ఆటంకం కలిగే అవకాశం ఉంటుంది.
- విద్యుత్ చౌర్యం పెరిగే అవకాశం ఉంది. లైన్ల నుంచి విద్యుత్‌ను అక్రమంగా వాడుకునే వారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

నేడు సహకార సంఘం మహాజన సభ

దొర్నిపాడు: మండలంలోని గుండుపాపల సహకార సంఘంలో మహాజనసభను సోమవారం నిర్వహిస్తున్నట్లు సీఈఓ సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జ్, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చీఫ్ మేనేజర్ అమర్‌నాథ్‌రెడ్డి, సూపర్‌వైజర్ శివకుమార్ కార్యక్రమానికి హాజరవుతారని చెప్పారు. సహకార సంఘం సభ్యులు పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గంగలో చేపల వేట



అయ్యన్ననగర్ వద్ద తెలుగు గంగలో చేపలు పడుతున్న యువకులు

మహానంది: తెలుగు గంగ కాల్వ నీటితో కళకళలాడుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి నీరు పుష్కలంగా వస్తుండటంతో జలకళ సంతరించుకుంది. కొత్తనీరు రావడంతో చేపలు సైతం పుష్కలంగా దొరుకుతున్నాయి. ఈ క్రమంలో మహానంది సమీపంలోని అయ్యన్ననగర్ వద్ద కొందరు యువకులు గాలాలతో చేపలు పడుతూ ఆదివారం ఇలా కనిపించారు.

రోడ్డు శిథిలం..ప్రయాణం నరకం



దెబ్బతిన్న రహదారి



రహదారి పక్కన పెరిగిన కంపచెట్లు

- గుంతలమయంగా సాంబవరం –నూనెపల్లె రహదారి
- రోడ్డు పక్కన పెరిగిపోయిన కంపచెట్లు
- ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని వైనం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

గోస్పాడు: గ్రామీణ ప్రాంతాల రహదారులు శిథిలమవడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. మండలంలోని సాంబవరం గ్రామం నుంచి చాబోలు మీదుగా నూనెపల్లెకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. బీటీ రోడ్డు కంకరతేలి, గుంతలు పడటంతో ప్రయాణం చేయడానికి జనం జంకుతున్నారు. వర్షం కురిస్తే గుంతల్లో వర్షపునీరు నిలిచి ఎక్కడ గుంత ఉందో.. తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక రోడ్డు పక్కన కంప చెట్లు పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఎదురుగా వచ్చే వాహనాలకు సైడ్ ఇవ్వలేకపోతున్నారు.

దెబ్బతింటున్న వాహనాలు..

రహదారి గుంతలమయం కావడంతో ఆ రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనాలు త్వరగా మరమ్మతులకు గురవుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు నిత్యం మరమ్మతులు చేయించాల్సిన పరిస్థితి నెలకొందని వాహనదారులు వాపోతున్నారు. బ్రేకులు, క్లచ్ ప్లేట్లు, గేర్ బాక్స్, షాక్ అబ్జార్బర్స్ తదితర భాగాలు త్వరగా చెడిపోతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా రోడ్డును బాగుచేయించాలని ఆయా గ్రామాల ప్రజలకు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఇస్కాన్‌లో భగవద్గీత తరగతులు



సందేశం ఇస్తున్న రఘునందన సేవక్ ప్రభు

కర్నూలు కల్చరల్: భగవద్గీత పఠనం, శ్రవణంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరీ జగన్నాథ మందిరంలో భగవద్గీత శిక్షణా తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు కార్యక్రమాలు జరిగాయి. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుంచే నైతిక విలువలు, సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం జగన్నాథ్, బలదేవ్, సుభద్రలకు మహా రాజభోగ నివేదన చేసి అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు.

నృత్యార్చన



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలయ దక్షిణ మాడ వీధిలోని నిత్యకళావేదికపై నెల్లూరుకు చెందిన వెంకటేశ్వర ఆర్ట్స్ అకాడమీ వారిచే నిర్వహించిన నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. గణపతి స్తుతి, చంద్రచూడ శివశంకర పార్వతి, శివతాండవ స్తోత్రం, ఓంకారనాథం, నమఃశివాయ, అఖిలాండేశ్వరి తదితర గీతాలకు మీనాక్షి, కీర్తి, వైష్ణవి, శ్రావణి, భువనేశ్వరి, భవ్య, తేజస్విని, హర్షిణి, చక్రీక, పూర్విత, నాగరిశ్వక, గీతిక, మేఘన, శరణ్య, శిరీష, దర్శిని తదితరులు నృత్య ప్రదర్శన చేశారు.

17న విగ్రహ ప్రతిష్ఠోత్సవం



కరపత్రాలను విడుదల చేస్తున్న సాయిబాబా ఆలయ సేవకులు

నంద్యాల(వ్యవసాయం): వచ్చే నెల 17న బొమ్మలసత్రంలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయం పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠ చేపట్టనున్నట్లు సాయి కమిటీ సేవకులు తెలిపారు. ఆదివారం ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మలికిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కాలేజీ చైర్మన్ వెంకటరామిరెడ్డి, డాక్టర్ రామకృష్ణారెడ్డి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ భక్తుల సాయంతో రూ.3.50 కోట్లతో నిర్మాణం పూర్తి చేసినట్లు చెప్పారు. అక్టోబర్ 13న గోపూజ, గణపతి యాగశాల ప్రారంభం, 14, 15, 16 తేదీల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి 17న నూతన బాబా విగ్రహం, మహాగణపతి, దత్తాత్రేయ, శ్రీకృష్ణ, శ్రీ వల్లీదేవసేన సుబ్రహ్మణ్య స్వామి, నందీశ్వర విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నట్లు వివరించారు. ఉత్సవాల సందర్భంగా రోజూ అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

రుద్రవరం: మండల పరిధిలోని రెడ్డిపల్లె మెట్ట వద్ద రెండు వాహనాలు ఢీకొని వెళ్లడంతో మంగలక్ష్మి, దుర్గాలక్ష్మి, వీరవేణి తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఒరిస్సాకు చెందిన భక్తులు టెంపో ట్రావెల్స్‌లో అహోబిల లక్ష్మీ నరసింహ్మాస్వామి దర్శించుకుని రుద్రవరం మీదుగా కోటప్పకు కొండకు వెళ్తున్నారు. రెడ్డిపల్లె సమీపంలోకి రాగానే పొలంలో నుంచి మిర్చీ లోడుతో రోడ్డెక్కుతున్న లారీ... టెంపో ట్రావెల్స్‌ను ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో ముగ్గురు మహిళలు తీవ్రంగా గాయ పడ్డారు. క్షత గాత్రులను వెంటనే రుద్రవరంలోని ప్రభుత్వ వైద్య శాలకు తరలించి ప్రథమ చికిత్సలు చేయించినట్లు గ్రామస్తులు తెలిపారు.

మహానందిలో తగ్గిన రద్దీ



మహానందీశ్వరుడి దర్శనార్థం వేచి ఉన్న భక్తులు

మహానంది: సాధారణంగా వీకెండ్, ఆది, సోమవారాల్లో భక్తులతో మహానంది ఆలయం కళకళలాడుతుంటుంది. అయితే ప్రస్తుతం మహాలయ పక్షాలు కావడంతో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది. దీంతో ఆదివారం పలు ప్రాంతాలకు చెందిన కొద్ది మంది భక్తులు మహానందికి చేరుకుని శ్రీకామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. ఉదయం, సాయంత్రం జరిగిన అష్టవిధ మహామంగళ హారతి పూజలు వైభవంగా జరిగాయి.

చిట్టడవులు కాదు!

- నంద్యాలలో ఖాళీ స్థలాల్లో పెరిగిపోయిన కంపచెట్లు, పిచ్చి మొక్కలు
- పారిశుద్ధ్య సమస్యగా మారిన వైనం
- నీరు నిల్వ చేరి పందులు, విష పురుగులు, దోమలకు ఆవాసాలుగా ప్రదేశాలు
- ఆందోళనకు గురవుతున్న కాలనీల వాసులు
- పట్టించుకోని అధికారులు

నంద్యాల పటణానికి ఖాళీ స్థలాలు ప్రధాన సమస్యగా మారాయి. ముఖ్యంగా మురుగు నీటి నిల్వలు, కంప చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిపోయి పారిశుద్ధ్యం లోపించి, పందులు, విషపురుగులు, కుక్కలు,దోమలకు ఆవాసాలుగా మారి అంటువ్యాధులు ప్రబలేందుకు ప్రధాన హేతువులుగా మారాయి. స్థలాల యజమానులకు మున్సిపల్ అధికారులు పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినా ఫలితం కనిపించడం లేదు. ప్రధాన కాలనీలతో పాటు శివారు ప్రాంతాల్లోనూ స్థలాలు చిట్టడవులను తలపిస్తున్నాయి.



ఎస్‌బీఐ కాలనీలో ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలు



టెక్కె భరతమాత గుడి ప్రాంతంలో మురుగు కుంటను తలపిస్తున్న ఖాళీ స్థలం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ఖాళీ స్థలాలు చిట్టడవులను తలపిస్తున్నాయి. పెద్ద చెట్లు, ముళ్ల కంచెల, పిచ్చి మొక్కలతో పట్టణంలోని పలు వార్డుల్లో దర్శనమిస్తున్నాయి. దీంతో విష సర్పాలు, దోమలు, పందులు ఖాళీ స్థలాల్లో తిష్టవేసి ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని, వ్యాధులు ప్రబలుతున్నాయని పట్టణ ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్, ఎన్‌జీఓ కాలనీ, హనీఫ్‌నగర్, హరిజనవాడ, టెక్కె భరతమాత గుడి ఏరియా, ఎస్‌బీఐ కాలనీ, మూలసాగరం, రైల్వే గూడ్‌షెడ్, దేవనగర్, పొన్నాపురం తదితర ప్రాంతాల్లో ఎటు చూసినా ఖాళీ స్థలాలు దర్శనమిస్తున్నాయి. ఏళ్ల తరబడి ఖాళీగా ఉండటంతో పెద్ద చెట్లు, పిచ్చి మొక్కలు, ముళ్ల చెట్లతో నిండిపోయాయి. దీంతో వాటి చుట్టూ నివాసముంటున్న వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖాళీ ప్రదేశాల్లో నుంచి పాములు, విష పురుగులు ఇళ్లల్లోకి వస్తుండటంతో భయాందోళన చెందుతున్నారు. ఇక ఇటీవల కురిసిన, ఆయా ప్రదేశాల్లోని వృథానీరు ఆయా స్థలాల్లో చేరి మడుగులను తలపిస్తున్నాయి. రోజుల తరబడి నీరు నిల్వ ఉంటుండటంతో దోమల బెడద తీవ్రంగా ఉంటోంది. ఈ కారణంగా జనం వ్యాధులబారిన పడుతున్నారు.

పట్టించుకోని అధికారులు...

ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, పొదలు పెరగకుండా ఎప్పటికప్పుడు స్థల యజమానులు వాటిని శుభ్రం చేసుకోవాల్సి ఉంది. యజమానులు శుభ్రం చేసుకునేలా మున్సిపల్ అధికారులు పర్యవేక్షించి, నిబంధనలు పాటించని స్థలాలను అధికారులు స్వాధీనం చేసుకునే వెసులుబాటు ఉంది. అయితే అధికారులు ఖాళీ స్థలాల వైపు కన్నెత్తి చూడటం లేదు. ఖాళీ స్థలాలు చిట్టడవుల్లా కనిపిస్తున్నా కనీస చర్యలు కొరవడ్డాయి. జనం నిత్యం ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ఇప్పటికే పలు స్థలాల యజమానులకు అధికారులు నోటీసులు ఇచ్చినా యజమానులు స్పందించడం లేదు. అధికారులు ఒత్తిడి చేస్తే రాజకీయ నాయకుల జోక్యంతో వారు చర్యలకు వెనకడుగు వేస్తున్నారు.









చిట్టడవులను తలపిస్తున్న బాలాజీ కాంప్లెక్స్, ఫరూక్ నగర్, ఎన్‌జీఓ కాలనీల్లోని ఖాళీ స్థలాలు

అధికారులు పట్టించుకోవడం లేదు



పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, కంప చెట్లు పెరిగి చిన్నపాటి అడవులను తలపిస్తున్నాయి. జనవాస ప్రాంతాల్లో ఇలాంటి వాతావరణంతో సమీప నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. ఖాళీ స్థలాలు విషపురుగులకు ఆవాసంగా మారడంతో వాటి సంచారం అధికమైంది. ఇళ్లలోకి కూడా విష పురుగులు ప్రవేశిస్తున్నాయి. అధికారులకు చెబుతున్నా పట్టించుకోక పోవడం విశేషం.

– వసంత్, బాలాజీ కాంప్లెక్స్, నంద్యాల

దోమలతో నరకయాతన



మేము ఉంటున్న పక్కనే పెద్ద ఖాళీ స్థలం ఉంది. స్థలాన్ని శుభ్రం చేయక పోవడంతో పిచ్చిమొక్కలు, చెత్తాదారంతో నిండిపోయింది. ఆ స్థలం పందులకు నివాసంగా మారింది. అలాగే దోమల బెడద తీవ్రంగా ఉంది. రాత్రి, పగలు తేడా లేకుండా కుట్టేస్తున్నాయి. ఎప్పుడు ఏ వ్యాధుల బారిన పడతామో తెలియక నరకయాతన అనుభవిస్తున్నాం.

– ఓబులరెడ్డి, ఎన్‌జీఓ కాలనీ, నంద్యాల

నోటీసులు ఇస్తాం

పట్టణంలోని అన్ని వార్డుల్లో ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించి, వాటికి సంబంధించిన యజమానులకు నోటీసులు ఇస్తాం. చాలా ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. వీటిని స్థల యజమానులు వీలైనంత త్వరగా తొలగించేలా చర్యలు చేపడతాం. నోటీసులు ఇచ్చిన తర్వాత కూడా స్థల యజమానులు స్పందించకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం.

–నిరంజన్‌రెడ్డి,
మున్సిపల్ కమిషనర్, నంద్యాల